# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 08-08-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లో పేదరిక నిర్మూలనకు పీ 4 విధానాన్ని తీసుకువచ్చామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**
2. **తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రూపొందించిన బిల్లును రాష్ట్రపతికి పంపామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అన్నారు.**
3. **ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతి రంగంలోనూ యాప్‌ల ద్వారా డిజిటల్ చెల్లింపుల విధానాన్ని ప్రోత్సహిస్తోందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.**
4. **తెలంగాణలో జాతీయ రహదారుల పనుల పర్యవేక్షణకు టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసినట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.**
5. **ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వరలక్ష్మీ వ్రతాన్ని ఈరోజు ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ లో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వ ప్రయివేట్ ప్రజల భాగస్వామ్యం -పీ 4 విధానాన్ని తీసుకువచ్చామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. విజయవాడలో గత రాత్రి జరిగిన పీ4 కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పారిశ్రామిక వేత్తలతో ముఖ్యమంత్రి సమావేశం అయ్యారు. ప్రభుత్వం చేపట్టిన పీ4 కార్యక్రమంలో భాగంగా మార్గదర్శులుగా ఉండాలని పారిశ్రామిక వేత్తలను కోరారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. ప్రజల భాగస్వామ్యంతోనే ఏ కార్యక్రమమైన విజయవంతమవుతుందని తెలిపారు. ఇప్పటి వరకు 10 లక్షల 81 వేల 281 మంది పేద కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకున్నారని కుటుంబాలను దత్తత తీసుకునేందుకు మరింత మంది ముందుకు రావాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా కోరారు.

--------------------------

తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రూపొందించిన బిల్లును రాష్ట్రపతికి పంపామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అన్నారు. ఢిల్లీలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రిజర్వేషన్లపై జంతర్ మంతర్ వద్ద మహా ధర్నా నిర్వహించామని చెప్పారు. ఈ ధర్నాకు 100 మంది పార్లమెంట్ సభ్యులు మద్దతు ఇచ్చారని తెలుపుతూ..

వాయిస్. 29 సెకన్లు

---------------------------

ఎన్టీఆర్  భరోసా ఫించన్ దారులకు స్మార్ట్ కార్డులు, పాస్ పుస్తకాలు ఇచ్చేలా  చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. అమరావతిలోని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ కార్యాలయంలో ఆ శాఖ పనితీరుపై మంత్రి నిన్న అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షా 71 వేల 264  స్వయం సహాయక సంఘాలకు సూక్ష్మ రుణ ప్రణాళిక ద్వారా రుణాలను త్వరితగతిన అందజేయాలని సూచించారు. సెర్ప్ ఏర్పాటై 25 ఏళ్లు అయిన సందర్భంగా, రజతోత్సవ వేడుకల  నిర్వాహణకు చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్  ప్రభుత్వం  ప్రతి రంగంలోనూ  యాప్ ల ద్వారా డిజిటల్ చెల్లింపుల విధానాన్ని ప్రోత్సహిస్తోందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.  నిడదవోలు మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో  పెరవలి చెక్ పోస్ట్‌లో ఏర్పాటు చేసిన డిజిటల్ చెల్లింపు విధానాన్ని ఆయన నిన్న ప్రారంభించి, మాట్లాడారు. వ్యవసాయ మార్కెట్ కమిటీల తనిఖీ కేంద్రాల వద్ద ఎటువంటి అవతవకలకు తావు లేకుండా డిజిటల్ చెల్లింపు విధానాన్ని ప్రారంభించామన్నారు. రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టుగా  ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ విధానం వల్ల మార్కెట్ యార్డ్‌లు తమ ఆదాయ లక్ష్యాలను వంద శాతం చేరుకోవచ్చని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ..30 సెకన్లు

---------------------------

నూజివీడు నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఆంధ్రప్రదేశ్ గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి తెలిపారు. ఏలూరు జిల్లా నూజివీడులో పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి నిన్న ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నూజివీడు పట్టణ అభివృద్ధికి 5 కోట్ల రూపాయలను కేటాయించామని చెప్పారు. నియోజకవర్గంలో కాలువలు, చెరువుల అభివృద్ధి పనులకు  నిధులు మంజూరు చేశామని మంత్రి తెలుపుతూ,

వాయిస్ ..34 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ నుంచి  2026 హజ్ యాత్రకి  విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రాన్ని ఎంచుకున్న వారికి లక్ష రూపాయల ఆర్థిక సాయం అందిస్తామని  మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడించారు. అమరావతిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ముస్లిం మత పెద్దలతో ఆయన నిన్న సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రం  నుంచి హజ్ యాత్రకు వెళ్లే వారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని   కోరారు.

---------------------------

తెలంగాణలో జాతీయ రహదారుల పనుల పర్యవేక్షణకు ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసినట్లు రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో వివిధ శాఖల అధికారులతో కొత్తగా ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్ కమిటీతో మంత్రి నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా

ఆయన మాట్లాడుతూ.. కల్వకుర్తి-శ్రీశైలం 62 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ కోసం అటవీ శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని, భూసేకరణ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రాంతీయ బాహ్యవలయ రహదారి- ఆర్ఆర్ఆర్ భూసేకరణలో భాగంగా సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, భువనగిరి జిల్లాల్లో సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

--------------------------

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వరలక్ష్మీ వ్రతాన్ని ఈరోజు ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. సౌభాగ్యం, కుటుంబ శ్రేయస్సు కోసం వివాహిత స్త్రీలు శ్రావణ మాసంలో వరలక్ష్మీ వ్రతం ఆచరిస్తారు. శ్రావణ మాసం శుక్ల పక్షంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారాన్ని మహిళలు వరలక్ష్మీ వ్రతంగా జరుపుకోవడం సంప్రదాయంగా వస్తోంది. వరాలు ఇచ్చే దేవతగా వరలక్ష్మీ దేవిని కొలుస్తారని... ఈ రోజున అమ్మవారిని పూజిస్తే అష్ఠ ఐశ్వర్యాలు కలుగుతాయని పురాణాలు పేర్కొంటున్నాయి. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లోని అన్ని ప్రధాన ఆలయాలు... ప్రత్యేకించి వైష్ణవాలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో కూడా వరలక్ష్మీ వ్రతాన్ని ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు.

--------------------------

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ-టీజీఎస్ఆర్టీసీలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ కొందరు మోసం చేస్తున్నట్లుగా తమ దృష్టికి వచ్చిందని ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని ప్రలోభాలకు గురిచేసి నగదు మోసాలకు పాల్పడే దళారుల మాటలు నమ్మవద్దని ఈ మేరకు నిన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగాల పేరుతో ఎవరైనా సంప్రదిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకొచ్చి, స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని టీజీఎస్ఆర్టీసీ సూచిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆర్టీసీలో 3 వేల 38 పోస్టుల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్ త్వరలోనే వెలువడనుందని తెలిపారు.

--------------------------

పశ్చిమ మధ్య వాయువ్య బంగాళాఖాతంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, దీని ప్రభావంతో ఈనెల 13వ తేదీ నాటికి బంగాళాఖాతంలో అల్పపడీనం ఏర్పడే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీంతో ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే రెండు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి బి.శేఖర్ తెలియజేస్తూ....

వాయిస్...20 సెకన్లు

మరోవైపు తెలంగాణలో రానున్న నాలుగు రోజులపాటు ఉరుములు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు అన్ని జిల్లాలకు ఎల్లో అలర్ట్‌ను జారీ చేసింది.

=====================